క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



తల్లికి బిడ్డను అందిస్తున్న 108 సిబ్బంది

కొండపి (సింగరాయకొండ): నిండు గర్భిణి 108 వాహనంలోనే శిశువుకు జన్మనిచ్చిన సంఘటన టంగుటూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. వీరిదేవి గ్రామానికి చెందిన జె.శ్రీలేఖ సాయంత్రం పురిటి నొప్పులతో స్థానిక సీహెచ్‌సీలో చేరింది. మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఒంగోలు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. 108 లో ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు.

మర్రిపూడి ఎస్‌ఐగా రమేష్‌బాబు



ఎస్‌ఐ రమేష్ బాబు

మర్రిపూడి: మండల కేంద్రం మర్రిపూడి ఎస్‌ఐగా రమేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీహెచ్ బసవరాజు బదిలీపై త్రిపురాంతకం వెళ్లగా, పెదచెర్లోపల్లి మండల ఎస్‌ఐగా పనిచేస్తున్న రమేష్ బాబు ఇక్కడకు వచ్చారు. మండలంలో పేకాట, కోడి పందేలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు.

సీఐగా భీమానాయక్ బాధ్యతల స్వీకరణ



భీమానాయక్

పామూరు: పామూరు సీఐగా ఎం భీమానాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతోపాటు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. సర్కిల్ పరిదిలో పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం రామానాయక్ గుంటూరుజిల్లా వట్టిచెరుకు సీఐగా బదిలీపై వెళ్లారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోట వద్ద మన్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.బాజీ బాబు చెప్పారు. వీఆర్‌కోట వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి వీఆర్‌కోట శివారుల్లో ఇసుక లోడుతో వెళుతున్న ఇసుక ట్రాక్టర్లపై దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



ఎస్‌ఐ నాగ మల్లీశ్వరరావు

టంగుటూరు: మండల కేంద్రం టంగుటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సై వి. నాగ మల్లీశ్వరరావు అన్నారు. టంగుటూరు ఎస్సైగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు దిశ పోలీస్ స్టేషనను నుంచి ఇక్కడకి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పున్నారావు జరుగుమల్లి వెళ్లారు.

24న మండల సమావేశం

ఉలవపాడు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24 న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయకుమారి తెలిపారు. ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేడు గ్రామసభలు

కనిగిరి రూరల్: ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపునకు మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్‌పీఎల్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయా పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఉదయం 11 గంటలకు గ్రామసభ ప్రారంభమవుతుందని, పంచాయతీల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.

ఉలవపాడు వస్తే..వీఆర్‌కు వెళ్లడమే..!

- ఉలవపాడు పనిచేసిన ఎస్సైలు నేరుగా వీఆర్‌కే
- 90 శాతం మంది ఎస్సైలది ఇదే పరిస్థితి..
- జిల్లా మారినా మారని వీఆర్ భయం



ఉలవపాడు పోలీస్‌స్టేషన్.

ఉలవపాడు: ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తే..ఆ తరువాత వీఆర్‌కు వెళ్లడమే..ఈ చరిత్రను కొనసాగిస్తూ తాజా ఎస్సై బాజిరెడ్డి సైతం వీఆర్‌కు వెళ్లారు. గత 20 ఏళ్లుగా ఉలవపాడులో పనిచేసిన 90 శాతం ఎస్సైలది ఇదే పరిస్థితి. ఇక్కడ పనిచేస్తే వీఆర్ భయం వెంటాడుతుందని పత్రికల్లో కథనాలు వచ్చినా ఎస్సైల పనితీరు మారని కారణంగానే వీఆర్‌కు వెళుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నలుగురు మాత్రమే బదిలీ..

2006 నుంచి ఉలవపాడులో పనిచేసిన ఎస్సైల్లో నలుగురు మాత్రమే బదిలీపై వెళ్లగా మిగిలిన వారంతా వీఆర్‌కే వెళ్లారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సైలపై ఉన్నతాధికారుల కన్ను పడడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. జాతీయరహదారి కావడంతో అక్రమంగా ఆయిల్ పట్టే దుకాణాలు నుంచి నెలవారీ మామూళ్లు, హోటళ్ల ద్వారా వచ్చే నగదు, తీరప్రాంతాల్లో జరిగే జూదం, రోడ్డు ప్రమాదాల వచ్చే ఆదాయాల వల్ల ఇంటిలిజెన్స్ అధికారులు ఇచ్చే నివేదికలు తేడాగా ఉంటున్నాయి. కానీ ఈ సారి మాత్రం ఎస్సై బదిలీలో రాజకీయ కోణం కూడా ఉందని తెలుస్తుంది. స్థానిక ఎమ్మెల్యే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి వద్దని, తన సొంత సామాజిక వర్గం వ్యక్తి కావాలని చెప్పడంతో తాజా మాజీ ఎస్సైను వీఆర్‌కు పంపినట్లు సమాచారం. కానీ ఏది ఏమైనా ఉలవపాడు నుంచి వీఆర్‌కు వెళ్లడం జరుగుతూనే ఉంది.

90 శాతం ఎస్సైలు వీఆర్‌కే...

2005లో ఎస్సైగా వచ్చిన రమేష్ 2006లో వీఆర్‌కు వెళ్లారు. 2007లో అక్కేశ్వరరావు ప్రమోషన్‌పై వెళ్లగా, 2009లో మురళీకృష్ణారెడ్డి, 2011లో సోమశేఖర్, 2012లో విజయచంద్రలు వీఆర్‌కు వెళ్లారు. 2013లో నఫీజ్‌బాషా బదిలీపై వెళ్లారు. 2014లో వై శ్రీనివాసరావు, 2017లో ఎం రాజేష్, 2018లో వైవీ రమణయ్యలు వీఆర్‌కు వెళ్లారు. 2019లో పనిచేసిన శ్రీకాంత్ సస్పెండ్ అయ్యారు. 2020లో దేవకుమార్ బదిలీపై వెళ్లారు. 2021లో విశ్వనాథరెడ్డి, 2023లో త్యాగరాజు వీఆర్‌కు వెళ్లారు. తాజా మాజీ ఎస్సై బాజిరెడ్డి సైతం వీఆర్‌కు వెళ్లారు. ఉలవపాడు మండలం ప్రకాశం జిల్లా నుంచి నెల్లూరు జిల్లాకు మారినా ఇద్దరు ఎస్సైలూ వీఆర్‌కు వెళ్లడం గమనార్హం. ఉలవపాడు అంటే వీఆర్ భయం వెంటాడుతోంది. తాజాగా వీఆర్ నుంచి అంకమ్మను ఎస్సైగా నియమించారు. ఇప్పటికే ఓ వైపు వీఆర్, మరో వైపు ఎమ్మెల్యే తన సొంత సామాజిక వర్గానికి చెందిన ఎస్సైను ఇక్కడ నియమించుకున్నాడని గ్రామంలో చర్చ సాగుతోంది. నూతనంగా వచ్చే ఎస్సై బాధ్యతగా పనిచేసి వీఆర్ నుంచి తప్పించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పుడు ప్రారంభిస్తారో..?



ప్రారంభానికి నోచుకోని వేములపాడు గ్రామ సచివాలయం

- ప్రారంభానికి నోచుకోని గ్రామ సచివాలయాలు

హనుమంతునిపాడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సచివాలయాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ గ్రామాన నూతన సచివాలయాల భవనాలను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించారు. అయితే ఎన్నికలకు ముందు వీటి నిర్మాణం పూర్తి కావడంతో కోడ్ కారణంగా వీటిని ప్రారంభించ లేదు. మండలంలోని వేములపాడు, కూటాగుండ్ల, కొండారెడ్డిపల్లి, లింగంగుంట్ల, నందనవనం, ముప్పళ్లపాడు, హనుమంతాపురం గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా సచివాలయాల ప్రారంభం గురించి పట్టించుకోవడం లేదు. అధికారులు కూడా ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేములపాడు, తిమ్మారెడ్డిపల్లి, నందనవనం, సీతారాంపురం, కొండారెడ్డిపల్లి, ముప్పళ్లపాడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలో విధులు నిర్వహిస్తున్నారు. పెద్దగొల్లపల్లి, లింగంగుంట్ల, హనుమంతాపురం పంచాయతీలో మూతపడిన పాఠశాలల్లో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వాలిచర్ల గ్రామంలో ప్రైవేట్ అద్దె ఇంట్లో సచివాలయ విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాలు పూర్తి చేసినా ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించలేదంటున్నారు. దీంతో సిబ్బంది చాలీచాలని ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. లక్షలు ఖర్చు చేసి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సచివాలయాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో పూర్తయిన సచివాలయ భవనాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

నూరుశాతం ఫలితాలపై దృష్టి సారించాలి



పామూరు జీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర



పామూరు కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

పామూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఫలితాల సాధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర అన్నారు. పామూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల, స్థానిక కేజీబీవీ విద్యాలయ్యాన్ని గురువారం ఆమె ఎంఈఓతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీచేసి.. పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల కొరత, పాఠశాలలో సమస్యలపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని డీఈఓ దృష్టికి తీసుకురాగా కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటుపై ఆమె దృష్టికి తీసుకురాగా పాఠశాల కార్యరూపం దాల్చేందుకు కృషి జరుగుతోందన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి విద్యాకిట్లు పూర్తిస్థాయిలో అందాయా లేదా, మధ్యాహ్న భోజనం, ఇతర వసతులపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించారు. ఇప్పటి నుంచే ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని పదో తరగతి వార్షిక పరీక్షల్లో కేజీబీవీని ప్రథమస్థానంలో నిలపాలని ఎస్‌ఓకు సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల ట్యాబ్ బేస్‌డ్ పరీక్షను పరిశీలించి సూచనలు చేశారు. ఎంఈఓ జి.కరుణకుమారి, జీహెచ్ఎస్ హెచ్‌ఎం ఎం రామస్వామి, ఎస్ఓ కటకం సజన, ఏఓ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంపీపీ ఇంటూరి సుశీల

కందుకూరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ ఇంటూరి సుశీల అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ మొక్క నాటారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు నాటి దాన్ని సంరక్షించే పెద్దది చేయాల్సిన బాధ్యత కూడా నాటిన వ్యక్తే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎల్.సుజాత, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు



మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న ఎస్ఐ మహేంద్ర

సింగరాయకొండ: పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందేలు, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని ఎస్సై బి. మహేంద్ర అన్నారు. స్థానిక ట్రంకురోడ్డులో గురువారం ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు తమ ఇష్టం వచ్చినట్లు రోడ్లపై ఆటోలు ఆపితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

నేడు మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే రాక

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురంలో గురువారం జరగనున్న ఉపాధి హామీ పథకం గ్రామ సభకు మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

డెత్ ఓటర్లను గుర్తించాలి

హనుమంతునిపాడు: పంచాయతీల్లో మృతి చెందిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన కుటుంబాలను గుర్తించాలని తహసీల్దార్ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమీక్షించారు. బీఎల్‌ఓను వివరాలు గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం 18 ఏళ్లు నిండిన ఓటుకు అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు.

వివాహ వేడుకల్లో దద్దాల



ఉప్పలపాడులో వధువును ఆశీర్వదిస్తున్న దద్దాల నారాయణయాదవ్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన గిద్దా నరసింహులు, ఈశ్వరమ్మల కుమార్తె ఉమామహేశ్వరి వివాహ వేడుకలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ హాజరయ్యారు. ఈసందర్భంగా పెండ్లికుమార్తెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

వెలిగండ్ల: మండలంలోని చెన్నంపల్లిలో గన్నవరం సర్పంచ్ నారాయణమ్మ, తిరుపతయ్య కుమార్తె వివాహ వేడుకల్లో కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. పందువలో కుమ్మరికుంట రోశయ్య, ఎస్తేరమ్మ కుమారుడు శామ్యూల్, ప్రత్యూషల వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కణంపాడులో రేగలగడ్డ నడిపి మహాలక్ష్మయ్య, లక్ష్మమ్మ కుమారుడు వెంకటేశ్వర్లు వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. అగ్రహారంలో ఎలికా చంద్రకళ పెండ్లి సందడిలో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, వెలిగండ్ల సర్పంచి టి.సురేష్ బాబు, నాయకులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలోని వగ్గంపల్లె కొండారెడ్డి పల్లె గ్రామంలోని మద్దులూరి మాల్యాద్రి, రమణమ్మ దంపతుల కుమార్తె మద్దులూరి మాధవి వివాహానికి హాజరైన ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

కనిగిరి రూరల్: మండలంలోని ఎన్ గొల్లపల్లిలో జరిగిన మందా వారి వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. తాళ్లూరి కళ్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముత్యాల నారాయణరెడ్డి కుమార్తె వివాహ నిశ్చితార్థ వేడుకల్లో, స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో జరిగిన కొత్తపల్లి వారి వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ దంపతులు పాల్గొన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరక్టర్ దద్దాల రాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, మండాది కృష్ణారెడ్డి, చింతం శ్రీనివాసుల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీ పల్లి: మండలంలోని చిన్నవరిమడుగు, మారెళ్ల, పిల్లివారిపల్లెలో జరిగిన వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు రూరల్: నంద్యాలలో ఈ నెల 25న జరిగు బాంసెఫ్, రాష్ట్రీయ మూలనివాసి సంఘ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని బాంసెఫ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ నిరంజన్ అన్నారు. మహాసభల వాల్‌పోస్టర్లను స్థానిక పూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎంఎం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం వెంకట్రావు, చార్వాక, మాల్యాద్రి, కె.ధనుజయ, బ్రహ్మానాయుడు, మాధవరావు, పూరిమిట్ల మాధవరావు, పురుషోత్తం, మోహన్‌లు పాల్గొన్నారు.

కేజీబీవీకి వాటర్ ఫ్రిజ్ వితరణ



కేజీబీవీ వాటర్‌ఫ్రిజ్‌ను అందజేస్తున్న అభిమానులు

పామూరు: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయానికి సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా అభిమానులు గురువారం వాటర్ ఫ్రిజ్ అందజేశారు. ఎస్ఓ కటకం సజనకు అందజేశారు. కార్యక్రమంలో షేక్.సందాని, వెంగళశెట్టి బాబూరావు, రామిశెట్టి సునీల్, పందిటి గురవయ్య, గోష్ఠ సునీల్, పాఠశాల ఏఓ వాణి, మండ్లా శైలజ, జయలక్ష్మి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట



సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులు

పామూరు: మండలంలోని ఇనిమెర్లలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తుల ప్రతిష్టా మహోత్సవం అర్చకుల వేదమంత్రాల నడుమ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు విశిష్ట పూజలు చేసి యంత్రాలను మూలవిగ్రహపీఠంపై ఉంచి అనంతరం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం నిర్వహించి..సాయంత్రం గ్రామోత్సవం కనులపండువగా సాగింది. కార్యక్రమాల్లో రాష్ట్ర పాఠ్య పుస్తకాల విభాగం జేడీ రవీంద్రనాథ్, డీఈఓ డి.సుభద్ర, ఎంఈఓ కె.కరుణకుమారి పాల్గొని పూజలు చేశఅరు. దేవస్థాన కమిటీ వారిని ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో వై.రామచంద్రారెడ్డి, యం.హరనాథరెడ్డి, సిద్దమూర్తి లక్ష్మిరెడ్డి, బాసు విజయభాస్కర్‌రెడ్డి, ఎల్ఎన్‌పురం జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సయ్యద్ ఇసాక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వయ్యారిభామను నిర్మూలించాలి



వయ్యారిభామపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కందుకూరు రూరల్: వయ్యారిభామ కలుపు మొక్క నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు అన్నారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ అర్జున్‌సింగ్, కేవీకే శాస్త్రవేత్తలు వయ్యరిభామ కలుపు మొక్క నివారణపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వయ్యారిభామ మొక్కతో ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నారు. ఈ మొక్క కనిపిస్తే వెంటనే పీకివేయాలని సూచించారు. వయ్యారిభామ నేల నుంచి నీటిని, పోషకాలను గ్రహించి పంట మొక్కలకి అందకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేష్, నీహారిక, జ్యోతి, మయాంక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ



కస్తూరిబా స్కూల్‌ను తనిఖీ చేస్తున్న జీసీడీఓ ప్రమోద

కనిగిరి రూరల్: కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జీసీడీఓ వి.ప్రమోద గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి ట్యాబ్ బేస్‌డ్ అసెస్మెంట్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల ట్యాబ్‌లను, రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జీసీడీఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యాభివృద్ధికి చేపడుతున్న ప్రణాళిక చర్యలపై, విద్యాబోధన తీరుపై చర్చించారు. ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ ఎస్ వీఐ ఎస్‌డీ మహబూబ్ రబ్బాని, ప్రిన్సిపాల్ ఎస్‌డీ హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

పొగాకులో అన్యపదార్థాలు ఉండకూడదు



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న ఎస్జీఓ సిద్ధరాజు

టంగుటూరు: రైతులు గ్రేడింగు సమయంలో పొగాకులో అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలని ఎస్జీఓ సిద్ధరాజు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన వేలంలో జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 924 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 842 కొనుగోలు జరిగాయి. గరిష్ట ధర రూ. 358 కాగా, కనిష్ట ధర రూ. 205 పలకగా, సరాసరి రూ. 310. 97 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ. 358

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పారాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1097 బేళ్లను తీసుకొని వచ్చారు. 902 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 196 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 358, కనిష్ట ధర 204, సరాసరి ధర రూ. 293.08 పలికింది. వేలంలో 16 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.